

నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నేడు శుక్రవారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తారని పేర్కొన్నారు.ఈ జాబ్ మేళాకు 30 ప్రముఖ కంపెనీలు అభ్యర్థుల చెంతకు వస్తారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జాబ్ మేళాలో 2000 ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు.ఉదయం 9 గంటలకు అభ్యర్థులు శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొని తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరవుతారని, వారందరికి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పిస్తామన్నారు.

గైర్హాజరీలపై గురి!

- జంపింగులు సహా మరికొందరిపై సందేహాలు
- 48 మంది జడ్పిటిసి సభ్యులకు నోటీసులు
- నేడు వేంపల్లికి వైఎస్ జగన్ రాక?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 27న చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని షెడ్యూలును జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పరిషత్ అధికార యంత్రాంగం ఈనెల 23న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇందులో భాగంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జిల్లాలోని 50 మంది జడ్పిటిసి సభ్యుల్లో 48 మందికి చైర్మన్ ఎన్నిక నిర్వహణ విధి విధానాలను వివరిస్తూ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యులుగా గెలిచిన మాజీ జడ్పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి రాజంపేట ఎమ్మెల్యేగా గెలిచారు. పులివెందుల జడ్పిటిసి మరణించిన రీత్యా రెండు స్థానాలు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా జిల్లాలోని 48 జడ్పిటిసి సభ్యుల్లో ఎంతమంది చైర్మన్ఎన్నికకు హాజరవుతారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే 8 మంది జడ్పిటిసిలు టిడిపి వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో మరో ఐదుగురు గైర్హాజరు కావడానికి అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది. ఈలెక్కన సుమారు 13 మంది జిల్లా పరిషత్ సభ్యులకుతోడు మరి కొందరు గైర్హాజరైతే పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. కోరం తలెత్తే వరకు పరిస్థితి వెళ్తే ఏమిటనే తర్జన భర్జన జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నాయకత్వం ఎవరెవరు గైర్హాజరవుతారు, వారిని చైర్మన్ ఎన్నికకు ఎలా రప్పించాలనే అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా వైసిపిలోని అసం తృప్తులను ఎలా బుజ్జగించాలనే ఆలో చన చేస్తున్నట్లు తెలుస్తోంది. 2024 డిసెంబర్లో రాజధాని ప్రాం తమైన తాడేపల్లిలో వైఎస్జగన్ సమక్షంలో వైసిపి జడ్టిసిలు బ్రహ్మ ంగారిమఠం జడ్పిటిసి రామ గోవిందరెడ్డిని ఏకగ్రీ వంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అనంతరం మాజీ చైర్మన్ నిర్వహించిన భారీ డిన్నర్లో పలువురు జడ్పిటిసిలకు కొంత మొత్తాన్ని సర్దుబాటు చేసినట్లు ప్రచా రంలో ఉంది. మరో ఏడాది న్నర జిల్లా పరిషత్ ఎన్నిక గడువు ఉన్న నేప థ్యంలో మరోసారి సర్దుబాటుకు అవ కాశం ఉందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉండగా వేంపల్లె జడ్పిటిసి కుమారుని వివాహ రిసెప్షన్కు శుక్రవారం వైఎస్ జగన్ హాజరయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వైసిపి నాయకత్వం జడ్పి చైర్మన్ఎన్నిక వ్యవ హారంపై సంప్రదించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార టిడిపి జిల్లా నాయకత్వం ఏడాదిన్నర వ్యవధిలోని జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వ్యవహారంపై ఆసక్తి చూపడం లేదనే సంగతి తెలుస్తోంది. లేనిపక్షంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం మరోలా ఉండేదనడంలో సందేహం లేదు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

అసెంబ్లీ లోనీ సిఎం ఛాంబర్లో కడప జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రెడ్డితో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జిల్లా అభివృద్ధి పై చర్చించారు. నిధులు, అభివృద్ధి పనులపై, తాగునీటి సమస్య వంటి వాటి గురించి సిఎంకు వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు ఆర్.మాధవి రెడ్డి, చైతన్య రెడ్డి, వరదరాజులురెడ్డి, ఆరవ శ్రీధర్, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు ఇన్ఛార్జి భూపేష్రెడ్డి, వైఎస్ఆర్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబు నాయుడును విజ్ఞప్తి చేశారు. మేలో నిర్వహించబోయే మహానాడు కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించారు.



సిఎంతో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు

'పోక్సో'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

పోక్సో చట్టం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి తెలిపారు. గురువారం పీలేరు మండలం, దొడ్డిపల్లి పంచాయితీ, బంగారం హరిజనవాడలో చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించే చట్టం పోక్సో చట్టం అని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో ఆశలు, ఆశయాలతో పెంచి పోషిస్తూ, వారిని విద్యా వంతులుగా తీర్చిదిద్దుతూ, కంటికి రెప్పలా కాపాడుకోవాలని చెప్పారు. సమాజంలో చిన్నపిల్లలు కూడా లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి వారిని మనమందరం కలిసి కట్టుగా రక్షణ ఇవ్వాలని కోరారు. ఇలాంటి లీగల్ అవేర్నెస్ కార్యక్రమాల ద్వారా ఒకరికొకరు అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు. చిన్నపిల్లలను లైంగిక వేధింపు లకులోనూ చేసినవారికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చూడాలని చెప్పారు. ముఖ్యంగా తల్లి దండ్రులు తమ ఆడబిడ్డలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించిన అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు భీమేశ్వరరావు, న్యాయవాదులు పి.వి రమణరెడ్డి, తెనాలి రామసుబ్రహ్మణ్యం, పారా లీగల్ వాలంటీర్ గట్టప్ప, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

అదనపు ఆర్థిక సాయంతో
ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి శివయ్య



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ అధికారి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ఎస్సి, ఎస్టి, బిసి గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంతో వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి శివయ్య లబ్ధిదారులకు సూచించారు. గురువారం గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్, ఎస్టి కాలనీ లేఅవుట్, రాయచోటి రూరల్ కాటి మాయకుంటలలో సిబ్బందితో కలిసి వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడారు. పేదలందరికీ ఒక గూడు కల్పించాలనే సదాశయంతో వివిధ దశల్లో నిర్మాణంలో ఆగిపోయిన ఎస్సి, ఎస్టి, బిసి ఇళ్లను త్వరగా పూర్తి చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఇంటి యూనిట్ రూ.1.80 లక్షలకు అదనంగా బిసి, ఎస్సిలకు రూ. 50వేలు, ఎస్టిలకు రూ.75 వేలు చొప్పున అదనపు ఆర్థిక లబ్ది కలుగుతుందన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్లో 8, ఎస్టి కాలనీ లేఔట్లో 12, రాయచోటి రూరల్ కాటమాయకుంట అరుంధతి వాడలో 14 ఎస్సి, ఎస్టి, బిసిల ఇళ్ల నిర్మాణాలలో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేసుకోవాలని, బిల్లులు కూడా త్వరితగతిన చెల్లిస్తామని లబ్ధిదారులకు తెలిపారు. పేదలకు గూడు కల్పించడంలో ప్రభుత్వం చూపుతున్న చొరవ, అదనపు ఆర్థిక సాయం అందజేయడంపై తమ హర్షాన్ని వ్యక్తం చేయడంతో పాటు పది రోజులలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రమేష్ నాయక్, కంప్యూటర్ అసిస్టెంట్ సాహిల్, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పరిశోధనే లక్ష్యంగా ముందుకు రావాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువ పరిశోధకులు బలమైన కాంక్షతో పరిశోధనే లక్ష్యంగా ముందుకు రావాలని శాస్త్ర పరిశోధనలో విస్తృత అవకాశాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎఫ్ ఎన్ఎ ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమీ ఆచార్య ఎ.ఎస్. రాఘవేంద్ర స్పష్టం చేశారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగళూరు), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (న్యూఢిల్లీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ప్రయాగ్‌రాజ్) ఆధ్వర్యంలో 'జీవశాస్త్రంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు' అనే అంశంపై లెక్చర్, వర్క్‌షాప్ విశ్వవిద్యాలయ లోని తాళ్లపాక అన్నమాచార్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఆచార్య ఎ.ఎస్. రాఘవేంద్ర మాట్లాడుతూ సైంటిఫిక్ లెక్చర్స్ పైన విద్యార్థులు స్కాలర్లు దృష్టి సారిస్తే సైన్స్ అకాడమీలు సహకారం అందిస్తాయన్నారు. 10 శాతం వరకు పరిశోధనల వైపు యువత రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రారంభ సభకు విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ వల్ల జీవులు జీవిత నైపుణ్యాలను నేర్చుకోవడంలో సహాయపడుతుందని చెప్పారు. వివిధ జాతుల మధ్య కమ్యూనికేషన్ పర్యావరణ సమతుల్యతను నిర్వహించడంలో సహాయపడుతుందన్నారు. కమ్యూనికేషన్ సహజీవన సంబంధాలను సులభతరం చేస్తుందని తెలిపారు. అతిథి కుల సచివులు ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ స్పెసిలైజేషన్లు ఉన్నత స్థాయిలో అధ్యయనం, పరిశోధనలను పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. జాతీయ విద్యా విధానం-2020 కూడా ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. వ్యాధుల నిర్ధారణ, చికిత్స, ఔషధం అభివృద్ధిలో వ్యవసాయం, పర్యావరణ స్థిరత్వం అంశాలలో సహాయపడుతుందన్నారు. కో- ఆర్డినేటర్ డాక్టర్ వి.రామకృష్ణ కార్యక్రమాన్ని సమన్వయం చేయడంతో పాటు విశ్వవిద్యాలయము పరిశోధనలపరంగా, విద్యార్థులను పరిశోధకులను ఆ దిశగా పయనింపజేసేలా ముందుకు వెళ్తోందని వివరించారు. ఆచార్య రాఘవేంద్ర 'ప్లాంట్ అడాప్షన్ టు ఎన్విరాన్మెంటల్ స్ట్రెస్' పై సైంటిఫిక్ ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో పరిశోధకులు విద్యార్థులు స్కాలర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్‌ను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

ప్రజాశక్తి- రాయచోటి

పదవ తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం చేపట్టనున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను గురువారం స్టేట్ అబ్జర్వర్ మధుసూదన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టనున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలలో గాలి వెలుతురుతో పాటు భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. పదవ తరగతి పరీక్ష జవాబు పత్రాల వాల్యుయేషన్ కార్యక్రమం అత్యంత పకడ్బందీగా భద్రపరచాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. స్పాట్ వాల్యుయేషన్‌కు వచ్చే ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు లేకుండా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లపై అరా తీశారు. ఎక్కడ ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, డిఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

అనైతిక పనులు చేయనందుకే కులాన్ని ఆపాదిస్తున్నారు
- తహశీల్దార్ భీమేశ్వరరావు

ప్రజాశక్తి-పీలేరు

అనైతిక పనులు చేయనందుకే మాల మహానాడు నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పీలేరు తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. ఒక పొసెషన్ సర్టిఫికెట్ మంజూరు చేయనందుకే తహశీల్దార్ తమను వేధించడమే కాకుండా చులకనగా ప్రవర్తించారని బుధవారం మాల మహానాడు నాయకులు ఆరోపించిన విషయం విధితమే. ఈ విషయంపై గురువారం తహశీల్దార్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. ఆయన కథనం మేరకు పీలేరు పట్టణం, లక్ష్మీపురం కాలనీకి చెందిన కె.రమేష్ అనే వ్యక్తికి అతని ఇంటిపై పొసెషన్ సర్టిఫికెట్ కావాలని మాల మహానాడు నాయకులు తనకు వినతి పత్రం రూపంలో కోరారన్నారు. ఆ ఇల్లు సర్వే నంబర్లలో వ్యత్యాసం ఉండడంతో పాటు పీలేరు పట్టణ పరిధిలో పొసేషన్ సర్టిఫికెట్లు ఇవ్వరాదని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు ఉండడంతో తాము అర్జీని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నామన్నారు. ప్రభుత్వ అధికారులను అదేపనిగా టార్గెట్ చేసుకుని కొందరు నాయకులు, కొన్ని సంస్థల కార్యకర్తలు అనుచిత, అనైతిక వ్యాఖ్యలు చేస్తున్నారని పీలేరు అర్బన్ సిఐ యుగంధర్ అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవ చేయడానికి ఉంటారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవడం పౌరుల హక్కని ఆయన తెలిపారు. కొంత మందికి కొంత ఆలస్యంగా పనులు చేసే అవకాశం ఉంటుందని, అంత మాత్రాన అధికారుల చిత్తశుద్ధిని శంకించడం, ఏక వచనంతో సంబోధించడమే కాకుండా దూషణలకు పాల్పడడం, సామాజిక మాధ్యమాలలో వీడియోలు పెట్టడం, గ్రూపుల్లో మెసేజులు పెట్టడం ఎంతవరకు సమంజస మన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసేవారిపై భవిష్యత్తులో కఠినంగా వ్యవహరిస్తామని, ఆయా గ్రూపుల అడ్మిన్లను కూడా ఆ వ్యాఖ్యలకు బాధ్యులుగా చేర్చి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న తహశీల్దార్, సిఐ

ఉర్దూ ఉన్నత విద్యా సంస్థలను పటిష్ఠపరచాలి : రూట

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా దశాబ్ద కాలం నుంచి ఉర్దూ ఉన్నత విద్యను నామమాత్రంగా నిర్వహిస్తున్నట్టు స్పష్టంగా అర్థం అవుతుందని, ఇది రాష్ట్రంలోనీ మైనారిటీ వర్గాల ఉర్దూ విద్యార్థులకు అన్యాయం చేయడమే అని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (రూట, ఏపి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , ముష్తాఖ్ హుసేన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగం తాత్కాలికంగా ఏర్పాటు చేసి దాదాపు దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికీ ఉర్దూ డిపార్ట్‌మెంట్ రెగ్యులర్ చేయడం, అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయలేదని తెలిపారు. అక్కడ చదువుతున్న పీజీ విద్యార్థులకు పరిశోధన కోసం పిహెచ్‌డి అవకాశం లేకుండానే కాలం గడుపుతున్నారని, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కర్నూలు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కర్నూలులో ఏర్పాటు చేసిన ఉర్దూ విశ్వవిద్యాలయంలో కేవలం అకాడమిక్ కన్సల్‌టెంట్, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలతో ఉన్నత కోర్సులన్నీ నిర్వహిస్తున్నారని చెప్పారు. మంజూరై భర్తీకి నోచుకోని అధ్యాపక పోస్టులను ఉర్దూ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి సమీపాన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించి మూడు సంవత్సరాలైన రెగ్యులర్ చేయలేదని పేర్కొన్నారు. తాత్కాలికంగా కేవలం గెస్ట్ ఫ్యాకల్టీలతో నిర్వహిస్తున్నారని, ఒక్క ప్రొఫెసర్ పోస్ట్ కూడా మంజూరు చేయలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 సంవత్సరాల నుంచి 10 ఉర్దూ జూనియర్ కళాశాలలలో ఒక్క లెక్చరర్ పోస్ట్ కూడా మంజూరు చేయకుండా గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్టు లెక్చరర్ల ద్వారా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇటు నిరుద్యోగ ఉర్దూ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా, అటు ఉర్దూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కటి కూడా ప్రభుత్వ యునాని మెడికల్ కళాశాల లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న యునాని మెడికల్ ఆఫీసర్ల పోస్టులు భర్తీచేయాలని వారు డిమాండ్ చేశారు.

భగత్ సింగ్ వర్ధంతి సభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 23న భగత్ సింగ్ 94వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం గీతాంజలి డిగ్రీ కళాశాల ఆవరణంలో జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి మాతృభూమి విముక్తి కోసం 1931 మార్చి 23న ప్రాణాలను తృణప్రా యంగా అర్పించారన్నారు.బ్రిటిష్ సామ్రాజ్య వాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరి తీశారని తెలిపారు. 23న పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదుట భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్ దేవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి కార్యక్రమం ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్ర మంలో పిడిఎస్‌యు మండల నాయకులు వినోద్, పృధ్వి, నందవిద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప

రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. మిషన్ రాయల సీమను అమలు చేయాలని కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి తాగునీరు, సాగునీరు, విద్య, ఆరోగ్య రంగాలు, ఉపాధి, వ్యవసాయం, పండ్ల తోటల సాగు వంటి కీలక రంగాలకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలని చేశారు.రాయలసీమను విత్తన రాజధానిగా ప్రకటించి, కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభు త్వాన్ని కోరారు. అదేవిధంగా, కియా, ఇసుజు వంటి ప్రధాన కంపెనీలను ఆకర్షి ంచి రాయలసీమను ఆటోమొబైల్ హబ్‌గా మార్చాలని సూచించారు. రాయ లసీమ పారిశ్రామిక అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొ ంటూ, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను రాయలసీమ ప్రధాన నగరా లకు అనుసంధానం చేయడం ద్వారా పారిశ్రామిక క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'మిషన్ రాయలసీమ'ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి తక్షణ చర్యలు తీసుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉప సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని అంకిశెట్టిపల్లి పంచాయతీ వైసిపి ఉప సర్పంచ్ సురేష్‌బాబు అనారోగ్యంతో మృతి చెందడం వైసిపికి తీరని లోటని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం వైసిపి నాయకులతో కలిసి సురేష్ బాబు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చడంతో పాటు పార్టీ మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వైసిపి నాయకుడిగా,అంకిశెట్టిపల్లి ఉపసర్పంచ్‌గా సురేష్‌బాబు విశేషమైన సేవలు అందించారన్నారు. నివాళులు అర్పించిన వారిలో అంకిశెట్టిపల్లి సర్పంచ్ శరత్‌రెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, మహేష్ బాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఇటీవల రాయచోటిలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బి.ఎస్.రావు మెమోరియల్ ట్రస్ట్ తరఫున జోనల్ లెవెల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భువనగిరిపల్లె ఆర్చి వద్ద గల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపుతాయని, క్రీడలు వారి మానసిక, శారీరక ఎదు గుదలకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు. విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసు కొని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శివశంక రయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి దీపిక, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి ప్రసన్న, ఉపాధ్యాయులు షబ్బీర్, హరికృష్ణ, హరిబాబు, నందిని, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం


పేదలకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న అబూబకర్ సిద్దిక్

చిన్నారుల గుండె చప్పుడు సినీ హీరో మహేష్‌బాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెండితెరపై సందేశాత్మక చిత్రాలు తీస్తూ నిజజీవితంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సినీ హీరో మహేష్ బాబు చిన్నారుల గుండె చప్పుడు అని మదనపల్లె మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు అబూబకర్ సిద్దిక్ అన్నారు. ఆంధ్ర ఆస్పత్రి సౌజన్యంతో మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న చిన్నారుల గుండె ఆపరేషన్లు 4,500 పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ బాబు ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ వేలాది మంది గుండెజబ్బుల చిన్నారులకు ఆపరేషన్లు చేయించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా, పట్టణంలో అన్నదానం నిర్వహించారు. భవిష్యత్తులో మహేష్ బాబు పేరిట ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు సతీష్, అఖిల్, యోధ అకాడమీ చిన్నారులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాల 2025-26 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కస్తూర్బా ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. ఆన్ లైన్ దరఖాస్తులు ఈ నెల 22 వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తు https://apkgbv.apcfss.in వెబ్‌సైట్ పొందవచ్చని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వేలంలో రూ.20 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతో పాటు బస్టాండ్ గేటు వేలం గురువారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో బహిరంగ వేలం నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు పశువుల సంత బస్టాండు గేటు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పదిమంది సభ్యులందరూ పాల్గొన్నారు. పశువుల సంతను కనపర్తి చంద్రశేఖర్‌రెడ్డి రూ.20లక్షలు, బస్టాండ్ గేటు సాకే వెంకటరమణ రూ.1.60 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. పెద్దవి ఆవు, గేదెకు ఒక్కొక్క దానికి రూ.40లు, చిన్నవాటికి ఒక్కోదానికి రూ. 20లుచొప్పున, పెద్దవి మేక, గొర్రెకు రూ.25, చిన్న పిల్లలకు రూ.10లు తీసుకోవాలన్నారు. బస్టాండ్ గేట్‌కు బస్సు లేక లారీ టిప్పర్లకు రూ.15, జీపు, ట్రాక్టర్, ట్యాక్సీలకు రూ.10, ఆటోలకు రూ.8 చొప్పున తీసుకోవాలన్నారు. ఆర్‌టిసి బస్సులు ప్రభుత్వ వాహనాలకు మినహాయింపు ఉంటుందని డిపిఒ మస్తాన్‌వలి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం రమేష్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి పట్నాయక్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాటకు వచ్చిన పాఠకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బస్టాండ్ గేట్ ఉచితం

-మానవత్వం చాటుకున్న టిడిపి నాయకుడు షేక్ అరీపుల్లా

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లె బస్టాండ్ పరిసర ప్రాంతాలలో చిరు వ్యాపారస్తులు దగ్గర అధిక మొత్తంలో బస్టాండ్ గేటు వసూలు చేయడం చూసి చలించిపోయిన టిడిపి యువనాయుడు షేక్ అరీపుల్లా వారికి బస్టాండ్ గేట్ దగ్గర వ్యాపారం చేసుకునేందుకు ఉచిత అవకాశం కల్పించారు. గ్రామపం చాయతీలో రూ.1.41లక్షలు సొంత నిధులతో బస్టాండ్ గేటును దక్కించు కున్నారు. ఇకమీదట లక్కిరెడ్డిపల్లి టౌన్ బస్టాండ్ టౌన్ పరిసర వీధులలో వ్యాపారం చేసుకునే వ్యక్తుల నుంచి ఎవరూ కూడా బస్టాండ్ గేటు వసూలు వసూలు చేయడం జరగదని అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం వెనుకబడిన ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో వ్యాపారం చేసుకునే వ్యక్తులు దగ్గర నుండి ఎటువంటి గేటు వసూలు చేయడం జరగదని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

గేట్‌లో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గేట్-2025 పరీక్షల్లో అద్భుత ప్రతిభను కనబరిచి ర్యాంకులు సాధించినట్లు ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో గెట్-2025 పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు ఐఐటికి నిర్వహించిన గేట్ పరీక్షల్లో అద్భుత ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. వారిలో 30 మందిపైగా విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఆశోక్ అమ్మిరెడ్డి కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో అఖిల భారత స్థాయిలో 12వ ర్యాంకు సాధించి విశ్వవిద్యాలయానికి గొప్ప పేరు ప్రతిష్ట తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆర్జీయూకేటీ రిజి స్ట్రార్ అమరేంద్ర కుమార్ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాస్, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు విద్యార్థులను అభినంది ంచారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక పోలీసు క్వార్టర్స్ ఆవరణలో గురువారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దువ్వూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దువ్వూరు పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ వినోద కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకు మేనేజర్ శ్యామ్ మాట్లాడుతూ ఎవరైనా తాము బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాం.. మీ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, ఒటిపి చెప్పమని అడిగితే మీరు చెప్పవద్దన్నారు. విభూది బ్రదర్స్ వారిచే కళాజాత కార్యక్రమం నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసులు, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు కరపత్రాన్ని గురువారం సిపిఎం నాయ కులు విడుదల చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 26న కడప ఉక్కు ఆంధ్రుల హక్కు సదస్సు జరుగు తుందన్నారు. ఈ సదస్సుకు సంబం ధించిన కరపత్రం విడుదల చేశామన్నారు. బిజెపి మూడో సారి అధికారంలోకి వచ్చి రాష్ట్రం విడిపోయే సందర్భంగా కడప జిల్లా స్టీల్‌ప్లాంట్, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదా తదితర వాటిని పొందు పరిచిం దన్నారు. సదస్సులో నిరుద్యోగులు, మేధా వులు, వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. కడప ఉక్కు సాధనకు కలసి పోరాడుదామని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ కార్య దర్శి విశ్వనాథ్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, లక్ష్మయ్య, బాలసుబ్బయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

పిల్లలకు ఆరోగ్యంతో పాటు విద్య చాలా అవసరం


పుల్లంపేట : మాట్లాడుతున్న సిడిపిఒ సౌభాగ్యమ్మ

ప్రజాశక్తి-రామాపురం


బిడ్డపుట్టి నప్పటి నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఆరోగ్యంతో పాటు విద్య అనేది చాలా అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి పేర్కొన్నారు. మండలంలోని అంగన్వాడీ వర్కర్లకు పోషణభీ పధైభీ కార్యక్రమంపై మూడు రోజులు శిక్షణ తరగతులను కొండవాండ్లపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 20 నుంచి 22 తేదీ వరకు మూడు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మొదటి రోజు ప్రధాన ఉపాధ్యాయులు సంధ్యారాణితో కలిసి మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. బిడ్డ పుట్టిన రోజు 3 సంవత్సరాల లోపు పిల్లలకు నవచేతన అని, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆధార్ సేలా అనే కార్యక్రమాలతో ఐదు రకాల అభివృద్ధి అంశాలపై ఈ శిక్షణ తరగతుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలను రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి ఒక టీమ్‌కు సుజాతరెడ్డి, రెండు టీమ్‌కు పద్మజరాణి, హుస్సేనమ్మ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతంపలిలో రైల్వే కోడూరు సిడిపిఒ సౌభాగ్యమ్మ, ఎసిడిపిఒ సరళ దేవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంగన్వాడీ సిబ్బందికి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషణ్‌భీ పధైభీ అనేది పిల్లలకు సమగ్రమైన, నాణ్యమైన ప్రారంభ ప్రేరణ, పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించడం, అభివృద్ధికి తగిన బోధన పద్ధతులను ఉపయోగించడం ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు మణెమ్మ, నిర్మలాదేవి, జయ లక్ష్మమ్మ, సుబ్బలక్ష్మి, రత్నమ్మ, శంకరయ్య పాల్గొన్నారు. **పీలేరు :** పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో విద్యార్థులకు మంచి పోషణాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందివ్వడమే లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, సిడిపిఒ రాజమ్మ తెలిపారు. పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోషణ్ భీ-పధైభీ అంశంపై అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య దశలో పిల్లలకు మంచి పోషణతో పాటు వారికి అర్థమయ్యేలా ఆటపాటలతో విద్యను బోధించాలని అన్నారు. బాల్యానికి ఎంతో ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉందని, వారి మానసిక, శారీరక, విద్యాభివృద్ధికి ఈ శిక్షణ కార్యక్రమం తోడ్పడేలా రూపొందించారని అన్నారు. అలాగే పిల్లలకు విద్యనందించే విధానం, ఆదర్శం, నవచేతన, పిల్లల మెదడు, అభివృద్ధి, పోషణ గురించి సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయ్య, ఉమ వివరించారు. కార్యక్రమంలో పీలేరు మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు :** నవచేతన, ఆదర్శిలా విద్యా విధానము గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శారీరక అభివృద్ధి, మేథోభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధి, సంస్కృతిక, కళాత్మక అభివృద్ధి గురించి శిక్షణ ఇచ్చారు. నవచేతన, ఆదర్శిలా విద్యా విధానం గురించి పిల్లలలో తగిన పురోగతిలో కీలక సామర్థ్యాలను నేర్చుకోవడంపై దృష్టి సాధించడం. వివరణాత్మక రోజువారి, వారపు పాఠ్యప్రణాళికను గురించి శిక్షణ ఇచ్చినట్లు సిడిపిఒ పద్మావతి తెలిపారు. **తంబళ్లపల్లె :** మండలంలోని కన్నెమడుగు జడ్‌పి హైస్కూల్, గోపిదిన్నె జడ్‌పి హైస్కూల్‌లో పోషణ భీ పధైభీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల అభివృద్ధిలో భాగంగా 0 నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు నవచేతన కార్యక్రమం, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆదర్శల కార్యక్రమాల మీద అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలందరికీ మంచి ఆటపాటలతో, బోధనా పద్ధతులను అవలంభించి రాబోయే తరాలకు పునాది వేయాలని పోషణభీ పధైభీ శిక్షణ ఉద్దేశ్యమని అన్నారు. **రాజంపేట అర్బన్ :** ఐసిడిఎస్ ప్రాజెక్టు రాజంపేట పరిధిలోని నందలూరు, రాజంపేట మండలాల లోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్‌భీ, పధైభీ కార్యక్రమం మీద గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను సిడిపిఒ వై.సుజామని, ప్రాజెక్టు కో-ర్డినటర్ హెచ్.రమేష్, సెక్టార్ సూపర్ వైజర్ ఆద్వర్యంలో రాజంపేటలోని ఎన్‌జిఒ భవన్‌లో ప్రారంభించారు. సిడిపిఒ వై.సుజామని శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజంపేట : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిడిపిఒ సుజామణి

టమోటా రైతులను ఆదుకోవాలి

-అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి



రాష్ట్రంలో టమోటా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే టమోటా కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా రైతుల్ని ఆదుకోవాలని, సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి రైతులను ఉద్దేశించి అసెంబ్లీలో విన్నవించారు. దక్షిణ భారతదేశంలోనే అతి అతిపెద్ద టమోటా మార్కెట్ మదనపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ మండలాల్లో ఉన్నాయని, ఉమ్మడి చిత్తూరు జిల్లా 14 నియోజకవర్గాల్లోనే కాకుండా కడప అనంతపురం జిల్లాలో కూడా రైతులు టమోటా పంటను నమ్ముకుని లక్షల ఎకరాల్లోసాగు చేస్తున్నారని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి సమయంలో రైతులను ఆదుకోవ డం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మార్కెట్ కమిటీ తరపున రైతుల దగ్గర నుంచి 10 నుంచి 15 రూపాయల వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వ్యవసాయం చేస్తూ అప్పులు చేసి పంటలు పండించి గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నారని, పంట పండించి మార్కెట్ కు తీసుకువెళ్తే అక్కడ దళారీలు, వ్యాపారస్తులు వంద కిలోల టమోటాలకు 10 కిలోలు తీసుకుంటూ ముక్కులు పిండి కమీషన్లు గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఉద్రిక్తతకు దారితీసిన చేపల చెరువు వేలంపాట

గ్రామస్తుల కోరిక మేరకు వాయిదా వేసిన అధికారులు


సచివాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం రాపూరిపల్లి సచివాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న టిడిపి, వైసిపి శ్రేణులు భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. రంగసముద్రంచెరువు చేపల వేలంలో ధరావత్తు చేయడానికి బుధవారం ఆఖరి కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు ధరావత్తు రుసుము చెల్లించడానికి రాపూరిపల్లి సచివాలయ కార్యాలయానికి వెళ్లారు. కొందరు కార్యాలయంలోనే తిష్టవేసి వేలంలో పాల్గొనకుండా తమను అడ్డుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.రాపూరివాండ్లపల్లి పంచాయతీ సెక్రెటరీ సురేఖ కనుసన్నలోనే ఈ తంతు మొత్తం జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. కార్యాలయంలోకి మీడియాను కూడా అనుమతి లేదంటూ పెద్దతిప్పసముద్రం ఎస్ఐ హుకుం జారీ చేశాడు.అధికారులు పంచాయతీ ఆదాయంపై దృష్టి పెట్టాలి కానీ,ఇలా ఏకపక్షంగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పైస్థాయి అధికారులు చొరవ చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అందరూ వేలంలో పాల్గొనే విధంగా మరల ధరావత్తు చెల్లించుకునేందుకు అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామస్తుల సూచన మేరకు చెరువు వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక అంబేద్కర్ కూడలి సమీపంలో పద్మావతి పాఠశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. పద్మావతి పాఠశాల కరస్పాండెంట్ నరేష్, టిడిపి రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంతగాని మాట్లాడుతూ జాబ్‌మేళా చదువుకున్న నిరుద్యోగులకు బాసట నిస్తుందన్నారు. గతంలో కోడూరులో నిర్వహించిన జాబ్‌మేళాలో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగవకాశాలు పొందారని అన్నారు. చిట్వేలి మండలంలోని నిరుద్యోగుల తల్లిదండ్రులు కోరడంతో ఇక్కడ కూడా జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న తనం నుంచి తాను చదువుకున్న సొంత ఊరు నేను తిరిగి ఇక్కడ నా సహచరుల పిల్లలకు జీవనోపాధి కల్పించి సహాయపడడం నాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇదే కాకుండా పిల్లల భవిష్యత్తు కోసం దేనికైనా వెనకాడ బోనని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగం కోసం వెళ్లే వారికి దగ్గరలో తన అనుచరులతో కలిసి కోడూరులో హాస్టల్ వసతి కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారికి ఈ జాబ్ మేళా ఉద్యోగ అవకాశాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ సేవా సంస్థ చైర్మన్ జ్ఞానశేఖర్‌రెడ్డి, నిరు ద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరసింహప్రసాద్

'ఉపాధి'లో బినామీ పేర్లు నమోదు చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న పీపీ వెంకటరత్నం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఉపాధి హామీ పథకంలో బినామీ పేర్లను నమోదు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం లక్కిరెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయం సముదాయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ బృందం నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యాప్తంగా రూ.43,284లు రికవరీలు చేశామని, 191452 పనులకు సంబంధించి తేడాలకు సంబంధించి ఎపిడి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సామాజిక తనిఖీ బహిరంగ సమావేశానికి ఉపాధి హామీ కూలీలు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర సహాయకులు రోజువారి మస్టర్ నమోదులు, ఎన్‌ఎంఎస్ ఫోటోలు అప్లోడ్ పనికి వచ్చిన వారివి మాత్రమే అప్‌లోడ్ చేయాలని లేని పక్షంలో క్షేత్ర సహాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎపిడి లక్ష్మీనారాయణ మండల విస్తరణ అధికారి ఢిల్లీబాబు, ఇసి వెంకటపతి, సాంకేతిక సహాయకులు క్షేత్ర సహాయకులు సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.


సమావేశం లో మాట్లాడుతున్న ఎంపిడిఒ

బిసిలు ఆర్థికంగా స్థిరపడాలి

ప్రజాశక్తి-నందలూరు

బిసి ఆర్థికంగా పడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ రాధాకృష్ణన్‌రాజు, ఇఒఆర్‌డి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో చేతివృత్తుల, కులవృత్తుల వారి తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతివృత్తుల, కులవృత్తుల వారికి అవసంమైన అధునాతన పనిముట్ల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుందని అన్నా రు. ఆదరణ-3 పథకం కింద వారి వృత్తికి అవసరమైన పనిముట్లను అందివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్ర మం లో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, బిసినాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


సమావేశం హాలు బయట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

డిపిఒపై ప్రజల ఆగ్రహం

-వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని చెంబకూరు పంచాయతి కేంద్రంలో గురువారం మదనపల్లి డిపిఒ నాగరాజ ఆధ్వర్యంలో వరపుసంత బస్టాండ్ గేటు వేలంపాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ గతంలో వారపుసంత బస్టాండ్ గేటు వేలంపాట దక్కించుకున్న వారు ఇంకా రూ 1.50 లక్షలు పంచాయతికి చెల్లించలేదని తెలిపారు. పంచాయతికి బాకీ పడ్డవారు నిధులు చెల్లించిన అనంతరం ఈ సంవత్సరం వేలంపాట నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ గతంలో జరిగిన విషయాలపై రాతపూర్వకంగా తమకు అందించాలని తెలిపారు. వేలంపాట సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేలంపాటకు మాత్రం ఒక్కరు మాత్రమే డిపాజిట్ చెల్లించారని మిగిలిన వారు ప్రేక్షకపాత్ర వహించడానికి వచ్చారా? అని ఎద్దేవా చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు సమావేశం హాలు ముందు బైఠాయించి డిపిఓ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. చేసేదిలేక వేలంపాట వాయిదా వేశారు. ప్రజలను అవమా నించిన అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చెంబకూరు గ్రామస్తులు కోరారు.

క్రైం కార్నర్


పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ


ప్రమాదంలో గాయపడిన రవి

నల్లమందు పేలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

నల్లమందు పేలి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కోన పంచాయితీ బంగారువాండ్లపల్లి సమీపంలో ఉన్న వారిలో చెన్నై నగరంలోని ఉండమలై ప్రాంతానికి చెందిన రవి గత రెండు నెలలుగా కూలి పనులు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం క్వారీలో ఉపయోగించేందుకు నల్లమందును ఎండలో ఆరవేసి ఉండడం వల్ల వేడి దాటికి ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఎండదాటికి నల్లమందు పేలడంతో ఆ ప్రాంతంలో ఉన్న రవి మంటలలో చిక్కుకొని ఒళ్లంతా పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ఇతనికి కుడి చెయ్యి మోచేతి వరకు లేకపోవడం ప్రమాదానికి మరో కారణం. ప్రమాదం జరిగి ఒళ్లంతా పూర్తిగా కాలిపోవడంతో అక్కడ ఉన్నవారు గమనించి ప్రయివేట్ వాహనంలో కలకడకు తరలించగా, అక్కడి నుంచి 108 వాహనంలో పీలేరుకు తరలించ్నిట్లు తెలిపారు. పీలేరు నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరాతీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంపం మీదపడి మరొకరికి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


గాయపడిన శ్రీనివాసులు

రంపం మీద పడడ ంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం ములక చెరువు మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేపూరుకోట పంచాయితీ, ఆవులపల్లికి చెందిన శ్రీనివాసులు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం చేస్తున్నాడు. పొరుగు గ్రామం బండమీదపల్లిలో భవనానికి మోల్డింగ్ వేయడానికి వెళ్లాడు. రంపంతో కొయ్యలు కట్ చేస్తుండగా పొరపాటున రంపం కాలు మీద పడడంతో కాలు రెండుగా తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు108లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించడంతో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘ టన గురువారం సాయంత్రం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..ముదివేడుకు చెందిన హసన్‌సాబ్ కుమారుడు మౌలాలి(26) స్థానికంగా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో కడప క్రాస్‌కు వచ్చి తిరుగు ప్రయాణ మ య్యాడు. ఇదే క్రమంలో సిద్ధారెడ్డిగారి పల్లెకు చెందిన శ్రీనివాసులు ముదివేడులో జరుగుతున్న జాతరకు వెళ్లి మొక్కులు చెల్లించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణ మయ్యాడు. రెండు వాహనాలు ముదివేడు పోలీసుస్టేషన్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా మౌలాలి మృతి చెందాడు. శ్రీనివాసులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రయివేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.